www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,70306545

సంపుటి - 2 సంచిక -100 ఆదివారం 16 జూన్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# విడతల వారీగా రుణమాఫీ?

## రేవంత్ ప్రభుత్వం కొత్త ఆలోచన



- వచ్చే నెల 15 నుంచి దశల వారీగా అమలు
- నిధుల సమకూర్పు కష్టతరం కావడంతో అధికారుల ప్రతిపాదన
- తొలుత 50వేల లోపు.. ఆ తర్వాత 75వేలు, లక్ష మాఫీ
- ఆగస్టు 15లోగా జమచేయాలనే అంశంపై చర్చలు
- 30వేల కోట్ల రూపాయలు అవసరమని అంచనా
- ముఖ్యమంత్రి పరిశీలనలో తుది నిర్ణయం

2లో.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్...



8 మంది నక్సలైట్లు, ఒక జవాన్ మృతి!
నారాయణపుర్‌లోని అబుజ్‌మాడ్ అడవుల్లో
ఇవాళ ఉదయం ఎన్‌కౌంటర్
నారాయణపుర్, కంకేర్, దంతేవాడ
జిల్లాలకు చెందిన భద్రతా దళాల యాంటీ
నక్సల్ ఆపరేషన్
ఈ నెలలో ఇది రెండో ఆపరేషన్
జూన్ 7న జరిగిన మొదటి ఆపరేషన్‌లో
ఐదుగురు నక్సలైట్లు హతం

# తెలంగాణలో 20 మంది ఐఏఎస్‌ల బదిలీ



- 20 మంది అధికారులకు స్థానచలనం కలిగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు
- ట్రాన్స్‌కో జేఎండి సందీప్ కుమార్ ఝా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బదిలీ
- నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బదావత్ సంతోశ్
- భద్రాద్రి కలెక్టర్‌గా జితేశ్ వి పాటిల్

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
తెలంగాణ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌ల బదిలీలను చేపట్టింది. 20 మంది అధికారులకు స్థానచలనం కలిగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. పెద్దపల్లి కలెక్టర్‌గా కోయ శ్రీహర్ష, నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా బదావత్ సంతోశ్, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను సిరిల్ల కలెక్టర్‌గా నియమించారు. కరీంనగర్ కలెక్టర్‌గా అనురాగ్ జయంతి, భద్రాద్రి కలెక్టర్‌గా జితేశ్ వి పాటిల్, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. అలాగే రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, పి.ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు.ఇక విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డిని నల్గొండ జిల్లా కలెక్టర్ గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, దివాకర్‌ను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నంద్‌లాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# స్వచ్ఛంధంగా తప్పుకోండి

## విద్యుత్ కొనుగోళ్లపై 12 పేజీల లేఖ రాసిన కేసీఆర్

- రాజకీయ కక్షసాధింపు ధోరణితతో కమిషన్ ఏర్పాటు చేశారని ఆరోపణ
- విద్యుత్ సంక్షోభంలో ఉన్న తెలంగాణను గట్టెక్కించామన్న కేసీఆర్
- కమిషన్ నుంచి నరసింహారెడ్డి స్వచ్ఛంధంగా వైదొలగాలని సూచన
- విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదన్న బీఆర్ఎస్ అధినేత
- విచారణకు హాజరైనా ప్రయోజనం ఉండదని చెప్పిన కేసీఆర్



2లో.

# అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలి

## భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష..

## అధికారులకు కీలక సూచన



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చిన సీఎం.. వర్షాకాలం సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మిగతాది 2లో...

# కేసీఆర్.. చట్టబద్ధ కమిషన్‌నే తప్పుపడతారా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
విద్యుత్ కొనుగోలు వ్యవహారంపై విచారణకు చట్టబద్ధంగా ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌నే కేసీఆర్ తప్పుపడతారా? అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "విచారణ కమిటీ ఛైర్మన్ వైదొలగాలని బెదిరించడం ముమ్మాటికీ ధిక్కరణే. కమిషన్ ఏర్పాటే తప్పయితే కోర్టుకు ఎందుకు వెళ్లలేదు?అక్రమాలకు పాల్పడకపోతే విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై వాస్తవాలెందుకు వివరించడం లేదు. తెలంగాణ ఉద్యమంలో జస్టిస్ నర్సింహారెడ్డి నిజాయతీ, ధైర్యసాహసాలను ప్రశంసించిన సంగతి మర్చిపోయారా? మీ తప్పిదాలను ఈఆర్సీపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా? చేసిన తప్పులు, అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్



ఎంతకైనా తెగిస్తారనడానికి ఫోన్ ట్యాపింగ్ నిదర్శనం. కోర్టు పరిధిలో ఉన్న ఫోన్ ట్యాపింగ్ అంశంపై అడ్డగోలుగా మాట్లాడి సుప్రీంకోర్టు ద్వారా చీవాట్లు తిన్న నేత కేసీఆర్. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, గొర్రెల పంపిణీపై విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయడం అనేక అనుమానాలు కలిగిస్తోంది. కేసీఆర్ సహా బాధ్యులను అరెస్టు చేసి వాస్తవాలను ప్రజల ముందుంచి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి" అని బండి సంజయ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# వర్సిటీ వీసీల పదవీకాలం పొడిగింపు



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
రాష్ట్రంలోని 10 యూనివర్సిటీల ఇన్‌ఛార్జ్ వీసీల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఇన్‌ఛార్జి వీసీలు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు ప్రస్తుతం ఐఏఎస్‌లను ఇన్‌ఛార్జి వీసీలుగా నియమిస్తూ మే 21న ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15వ తేదీ వరకు వాళ్లు ఇన్‌ఛార్జి వీసీలుగా కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. నేటితో వాళ్ల పదవీకాలం ముగియడంతో తాజాగా వారి పదవీకాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# స్వచ్ఛంధంగా తప్పుకోండి

**ప్రజావినికిడి,(హైదరాబాద్)::**
జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 12 పేజీల లేఖ రాశారు. విద్యుత్ కొనుగోళ్లపై ఆయన కమిషన్‌కు లేఖ రాశారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితోనే ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. తమ హయాంలో కరెంట్ విషయంలో గణనీయ మార్పులు చూపించామని పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్‌ను అందించినట్లు తెలిపారు. విద్యుత్ సంక్షోభంలో ఉన్న తెలంగాణను తాము అసాధారణ నిర్ణయాలతో గట్టెక్కించామన్నారు. తనపై కమిషన్ చైర్మన్ ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించినట్లు చెప్పారు. పదేళ్లు సీఎంగా చేసిన తన పేరును ప్రస్తావించారన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం కాలుష్యం, నిర్మాణ వ్యయం ఎక్కువ అని,



అందుకే తాము సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణాలు చేపట్టినట్లు ఆ లేఖలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశ్యంతోనే తనపై, గత ప్రభుత్వంపై ఆరోపణలు చేసి... అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజకీయ కక్షతో వేసిన ఈ కమిషన్ నుంచి నరసింహారెడ్డి స్వచ్ఛంధంగా వైదొలగాలని సూచించారు. ఆయన కూడా తెలంగాణ బిడ్డేనని వ్యాఖ్యానించారు. కమిషన్ విచారణ పారదర్శకంగా లేదన్నారు. విచారణ పూర్తి కాకుండానే ప్రెస్ మీట్ పెట్టారని పేర్కొన్నారు. కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శించారు. వాస్తవానికి జూన్ 15న కమిషన్ ఎదుట హాజరై సమాధానం ఇవ్వాలని భావించానని... కానీ విచారణ పారదర్శకంగా లేకపోవడంతో తాను హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని ఆగిపోయినట్లు చెప్పారు. విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని అర్థమైందన్నారు. అన్నింటా తాము చట్టాలను, నిబంధనలను పాటిస్తూ ముందుకు సాగామన్నారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు ముందుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈఆర్సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్నారు. కమిషన్లు వేయకూడదన్న విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు.

# అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలి

(మొదటి పేజీ తరువాయి)
ఓఆర్ఆర్‌ను యూనిట్‌గా తీసుకుని డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను ఇంటిగ్రేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సీసీ కెమెరాలు అన్నింటినీ వీలైనంత తొందరగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు.
అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా అధికారులను సీఎం, మంత్రులు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 141 వరద తీవ్రత ఉండే ప్రాంతాలను గుర్తించినట్లుగా అధికారులు తెలిపారు. వరద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. వరద నీరు ఎక్కువ వచ్చి చేరే ప్రాంతాల నుంచి సునాయాసంగా వెళ్లేలా వాటర్ హార్వెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఫిజికల్ పోలీసింగ్ విధానం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఎఫ్ఎం రేడియో ద్వారా ట్రాఫిక్ అలర్ట్స్ హైదరాబాద్ ప్రజలకు అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది కొరత లేకుండా హెూమ్ గార్డుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ఆదేశించారు.

# నీట్ పరీక్ష రద్దుకై సరికొత్త పిటిషన్

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
నీట్ యుజి 2024 పరీక్ష రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో సరికొత్త పిటిషన్ దాఖలైంది. మే 5న నిర్వహించిన పరీక్షలో అక్రమాల ఆరోపణలపై సర్వోన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో సిబిఐతో గాని, వేరే ఇతర స్వతంత్ర సంస్థతో గాని దర్యాప్తు జరిపించాలని ఆ పిటిషన్‌లో కోరారు. వైద్య ప్రవేశ పరీక్షకు హాజరైన 20 మంది విద్యార్థులు పిటిషన్‌ను దాఖలు చేశారు. సరికొత్తగా పరీక్ష నిర్వహించవలసిందని జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ)ను ఆదేశించాలని కూడా వారు పిటిషన్‌లో కోరారు. నీట్ యుజి 2024 పరీక్షలపై ఫిర్యాదులు చేసిన వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం విచారిస్తూ, పరీక్షలో ప్రశ్న పత్రం లీక్, ఇతర అక్రమాలపూ సిబిఐ దర్యాప్తు కావాలన్న వినతిపై కేంద్రం, ఎన్‌టిఎ నుంచి స్పందనలను కోరింది. 'పెద్ద ఎత్తున అవకతవకలు, మోసపూరిత పద్ధతుల అనుసరణ' దృష్ట్యా తిరిగి పరీక్ష నిర్వహించడం వైద్య సంస్థల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులను షార్ట్ లిస్ట్ చేయడానికి వీలు కలుగుతుందని కొత్త పిటిషన్ సూచించింది. 'మీడియా వార్తల ప్రకారం ప్రశ్న పత్రం లీకేజి కేసులు, ఎఫ్ఐఆర్ దాఖలు, పలువురు వ్యక్తుల




అరెస్టు దృష్ట్యా పరీక్ష పవిత్రత ప్రశ్నార్థకమైందని న్యాయవాది ధీరజ్ సింగ్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్‌టిఎ ప్రకటించిన ఫలితాల్లో 67 మంది అభ్యర్థులు గరిష్ఠంగా 720/720 మార్కులు సాధించినట్లు వెల్లడైందని, 620 నుంచి 720 మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్యలో అసాధారణ రీతిలో 400 శాతంపైగా పెరుగుదల ఉందని సునిశిత విశ్లేషణలో తేలిందని పిటిషన్ పేర్కొన్నది. 'ప్రతిభావంతులైన విద్యార్థులు అనేక మందికి న్యాయం చేయడానికి వీలుగా సదరు అక్రమాలపై సిబిఐతో గాని, ఈ కోర్టు పర్యవేక్షణలో వేరే ఇతర స్వతంత్ర సంస్థతో గాని, కమిటీతో గాని సమగ్ర దర్యాప్తు జరిపించవలసిన అవసరం ఉంది. సక్రమంగా పరీక్ష నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యం వల్ల అటువంటి విద్యార్థులకు అన్యాయం జరిగింది' అని పిటిషన్ తెలిపింది. '620, అంతకు మించి మార్కులు సాధించిన అటువంటి అభ్యర్థులు అందరి విద్యా విషయక నేపథ్యాన్ని పరిశీలించడం, ఫోరెన్సిక్ విశ్లేషణ, దర్యాప్తుతో సహా పరీక్ష అనంతర విశ్లేషణ' జరపాలని కోర్టు నియమించిన కమిటీని లేదా ఈ కోర్టు పర్యవేక్షణలో వేరే ఇతర స్వతంత్ర సంస్థను ఆదేశించవలసిందని పిటిషన్ కోరింది. భవిష్యత్తులో నీట్ యుజిలో మోసపూరిత విధానాలు, ప్రశ్న పత్రాల లీకేజి, బోగస్ వ్యక్తులు పరీక్ష రాయడం, అక్రమ పద్ధతులు అనుసరించడానికి సంబంధించిన ఆందోళనలను పరిహరించాలని, పరీక్ష ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత ఉండేటా సమర్థమైన చర్యలు తీసుకోవలసిందిగా ఎన్‌టిఎకు, ఇతరులకు ఆదేశాలు జారీ చేయాలని కూడా పిటిషన్ కోరింది. మే 5న 4750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ యుజి పరీక్షకు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఫలితాలను ఈ నెల 14న ప్రకటిస్తారని భావించారు. కానీ సమాధాన పత్రాల మూల్యాంకనం ముందుగానే పూర్తి అయినందున ఫలితాలను ఈ నెల 4న వెలువరించారు.

# ఈపిఎఫ్ ఖాతా ఉపసంహరణ నియమాలు మారాయి

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
మీ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్(ఈపిఎఫ్) ఖాతా నుంచి నగదును ఉపసంహరంచాలనుకుంటున్నారా అయితే ఇది మీ కోసమే! కరోనా సమయంలో తీసుకువచ్చిన కోవిడ్ అడ్వాన్స్ సదుపాయాన్ని నిలిపివేస్తున్నట్లు ఈపిఎఫ్ఓ ప్రకటించింది. కరోనా కారణంగా ఉద్యోగాల కోత, వేతన కోత వంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక ప్రయోజనం చేకూరేలా పిఎఫ్‌ను ఉపసంహరించుకునే




వెసులుబాటు కల్పించారు. ఈపిఎఫ్ ఖాతా నుంచి 75 శాతం తీసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు, కరోనా పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో నగదు ఉపసంహరణ నిబంధలను మార్చింది. కరోనా మహమ్మారి లేనందువల్ల అడ్వాన్స్ మొత్తం తీసుకునే అవకాశాన్ని నిలిపివేసినట్లు ఈపిఎఫ్ఓ తెలిపింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2020లో కరోనా మొదటి వేవ్ సమయంలో ఈపిఎఫ్ఓ ఈ సదుపాయాన్ని తీసుకువచ్చింది. రెండో వేవ్ వచ్చినప్పుడు దీనిని పునరుద్ధరించారు. దాదాపు నాలుగేళ్లు ఇది అందుబాటులో ఉంది. తొలుత ఒకసారి మాత్రమే అడ్వాన్స్ తీసుకునే వెసులుబాటు కల్పించినప్పటికీ%ౌ% ఆ తర్వాత పలుమార్లు పునరుద్ధరించారు. ఇప్పుడు దీనిని నిలిపివేశారు. అడ్వాన్స్ సదుపాయం నిలిచిపోయినప్పటికీ ఇంటి కొనుగోలు, పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగం కోల్పోవడం, అనారోగ్యం వంటి సందర్భాల్లో ఈపిఎఫ్ ఖాతాలోని నిర్దిష్ట పరిమితి మేరకు ఉపసంహరించుకోవచ్చు.

# కేసీఆర్ జైలుకెళ్లడం ఖాయం...

**ఆయనకు భయం పట్టుకుంది: బీఆర్ఎస్ అధినేత 'లేఖ'పై కాంగ్రెస్ నేతలు**

**నరసింహారెడ్డి విచారణ వద్దన్నారంటే కేసీఆర్ అవినీతిని అంగీకరించినట్లేనని కోమటిరెడ్డి వ్యాఖ్య**

**విచారణలో తన పేరు ఉందని కేసీఆర్ బాధపడటంలో అర్థం లేదన్న అద్దంకి దయాకర్**

**తప్పులు బయటపడతాయనే భయం పట్టుకుందన్న మహేశ్ కుమార్ గౌడ్**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం నరసింహారెడ్డి కమిషన్‌కు లేఖ రాసిన అంశంపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. మంత్రి



కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.
కేసీఆర్, జగదీశ్ రెడ్డిలు జైలుకు వెళ్లడం ఖాయమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి జోస్యం చెప్పారు. నరసింహారెడ్డి విచారణ వద్దన్నారంటే కేసీఆర్ అవినీతిని అంగీకరించినట్లేనని వ్యాఖ్యానించారు. నరసింహారెడ్డి నిజాయితీకి మారుపేరని తెలిపారు. విద్యుత్ ఒప్పందాలు, యాదాద్రి పవర్ ప్లాంటులో రూ. 30 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.
విచారణలో తన పేరు ఉందని కేసీఆర్ బాధపడటంలో అర్థం లేదని అద్దంకి దయాకర్ అన్నారు. ఆయనను బద్నాం చేయాలనే ఉద్దేశ్యం తమకు లేదన్నారు. కేసీఆర్ తన హయాంలో ప్రభుత్వ సంస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని విభాగాల్లోనూ కేసీఆర్ ప్రమేయంతోనే కుంభకోణాలు జరిగాయన్నారు.
తప్పులు బయటపడతాయనే భయం కేసీఆర్‌కు పట్టుకుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తప్పు చేయకపోతే కమిషన్ ముందు నిరూపించుకోవాలని సూచించారు. విద్యుత్ కొనుగోలు పెద్ద స్కాం అన్నారు. నిజానిజాలు ప్రజలకు తెలియాలన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎదురుకాల్పులలో 8 మంది నక్సలైట్లు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్(ఎస్‌టిఎఫ్)కు చెందిన ఒక జవాను మరణించారు. ఈ ఘటనలో మరో ఇద్దరు ఎస్‌టిఎఫ్ సిబ్బంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలి నుంచి నక్సలైట్లకు చెందిన



భారీ స్థాయిలో ఆయుధాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వారు చెప్పారు. నక్సలైట్ల ఏరివేత కార్యక్రమంలో భాగంగా నారాయణ్‌పూర్, కంకేర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన భద్రతా సిబ్బందితో కూడిన ఎస్టిఎఫ్ బృందం శనివారం ఉదయం అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో గాలిస్తుండగా కాల్పుల పోరు జరిగినట్లు రాయపూర్‌లో ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. దాదాపు గంటసేపు ఈ కాల్పుల పోరు సాగినట్లు ఆ అధికారి తెలిపారు.
కాల్పులు ఆగిపోయిన తర్వాత వెళ్లి చూసిన భద్రతా సిబ్బందికి నక్సల్స్‌కు చెందిన ఎనిమిది మృతదేహాలు లభించాయి. ఘటనా స్థలి నుంచి ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక 303 రైఫిల్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్, ఇతర ఆయుధాలు, మావోయిస్టు సంబంధ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆ అధికారి తెలిపారు. ఈ ఘటనలో ఒక ఎస్‌టిఎఫ్ జవాను మరణించగా మరో ఇద్దరు సిబ్బంది గాయపడినట్లు ఆయన చెప్పారు. గాయపడిన జవాన్లను స్థానిక ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందచేస్తున్నారు. కాగాఈ ఏడాదిలో ఇప్పటివరకు బస్తర్ డివిజన్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం 131 మంది నక్సలైట్లు మరణించారు. బస్తర్ డివిజన్‌లో కంకేర్, కొండగావ్, నారాయణ్‌పూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మ జిల్లాలు ఉన్నాయి.

# విడతల వారీగా రుణమాఫీ?

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
ఎలాగైనా రుణ మాఫీ చేసి తెలంగాణ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. జులై 15 నుంచి దశలవారీగా రుణమాఫీ చేయాలని సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారు. గడువు ముంచుకొస్తుందడంతో ఆగస్టు 15లోగా రూ. 2 లక్షల రైతు రుణమాఫీకి ప్రభుత్వం కొత్త మార్గాలను అన్వేషిస్తోంది. జులై 15 నుంచి రూ. 50వేల లోపు, ఆ తర్వాత రూ. 75వేలు, రూ.లక్ష.. ఇలా పెంచుతూ బ్యాంకులకు జమ చేసే విధానాన్ని పరిశీలిస్తోంది. రైతుల్లో 70% మందికి రూ. లక్ష లోపు రుణం ఉన్నట్లు అంచనా. తొలి దశలో వీరికి మాఫీ చేసి మిగిలిన వారికి ఆగస్టు 15లోగా జమ చేయాలనే అంశంపైనా చర్చ సాగుతోంది.
నిధుల లభ్యతపై స్పష్టత వచ్చాక అర్హుల గుర్తింపు ప్రక్రియ మొదలవుతుందట. ఇక అటు రైతు భరోసా, రుణమాఫీ, రైతు బీమా పథకాలకు 2 నెలల్లో రూ. 30 వేల కోట్లు అవసరమని ప్రభుత్వ వర్గాల అంచనా. ఆగస్టులోగా ఆ మేర రుణాలు తీసుకుంటేనే స్కీమ్ ల అమలు సాధ్యమని సమాచారం. బాండ్ల విక్రయం ద్వారా అప్పు తీసుకోవాలని నిర్ణయించింది. అయితే ఏప్రిల్, మేలో రూ. 8,246 కోట్లు సేకరించగా.. మరో రూ. 2వేల కోట్లు 3 రోజుల్లో తీసుకొనుంది. ఈ ఏడాది కోటాలో మరో రూ. 30 వేల కోట్లు తీసుకునేందుకు ఆర్బీఐ అంగీకరిస్తుందా..? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.
రైతుల రుణమాఫీ అమలు కోసం వృథాగా ఉన్న ప్రభుత్వ భూములను బ్యాంకుల్లో కుదువపెట్టి లోన్లు తీసుకోవాలని భావిస్తున్నది. ఇట్లయితే రైతుల పంట రుణాలన్నీ ఒకేసారి మాఫీ చేయొచ్చని, ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే తనఖాపెట్టిన భూములను మెల్లమెల్లగా విడిపించుకోవచ్చని ఆలోచన చేస్తున్నది. ఈ మేరకు రంగారెడ్డి, మేడ్చల్?మల్కాజిగిరి జిల్లాల్లో 760 ఎకరాలను ప్రభుత్వం గుర్తించింది. వీటి విలువ దాదాపు రూ. 48 వేల కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో కొన్ని భూములను బ్యాంకుల్లో తనఖా పెట్టడం ద్వారా కనీసం రూ. 15 వేల కోట్ల నుంచి రూ. 20 వేల కోట్ల వరకు ఏకకాలంలో సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆర్బీఐ గవర్నర్?తో ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

### సీఎం ముందు పలు ప్రతిపాదనలు..

ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15వ తేదీలోగా రూ. 2 లక్షల లోపు క్రాప్ లోన్లు మాఫీ చేస్తామని సీఎం రేవంత్?రెడ్డి హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నిధుల సర్దుబాటు కోసం అన్ని మార్గాలను సర్కార్ అన్వేషిస్తున్నది. ఆర్థిక శాఖ ఇప్పటికే పలు ప్రతిపాదనలను సీఎం రేవంత్ రెడ్డి ముందుంచింది. ప్రత్యేక కార్పొరేషన్? ఏర్పాటు చేసి దానికి ప్రభుత్వం గ్యారంటీగా ఉండి క్రాప్?లోన్ల మాఫీకి అవసరమైన మొత్తాన్ని రుణంగా తీసుకోవాలని మొదట భావించారు. కానీ ఈ అప్పును అదే కార్పొరేషన్? నుంచి తిరిగి చెల్లిస్తే సమస్య లేదని, లేదంటే ఎఫ్ఆర్?బీఎం పరిధిలోకి తీసుకురావాల్సి ఉంటుందని ప్రభుత్వానికి ఆర్బీఐ స్పష్టం చేసింది. దీంతో ప్రభుత్వ భూములను బ్యాంకుల వద్ద తనఖాపెట్టి పెద్ద మొత్తంలో రుణాలను తీసుకోవాలని అధికారులు రెండో ప్రతిపాదనను సీఎం రేవంత్ ముందుంచారు.

### ఎఫ్ఆర్ బీఎం పరిధిలోనే.. : సీఎం దృష్టికి అధికారులు

ఆర్బీఐలో కొన్ని నిబంధనల కారణంగా భూములను తాకట్టు పెట్టినా కూడా ఎఫ్ఆర్?బీఎం పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉందని పలువురు ఆఫీసర్లు సీఎం రేవంత్?దృష్టికి తెచ్చారు. దీంతో ప్రభుత్వ భూములను తనఖా పెట్టినా ఎఫ్ఆర్?బీఎం పరిధిలోకి రాకుండా ఏం చేయాలనే దానిపై కసరత్తు చేయాలని అధికారులకు సూచించగా, ఆయా భూములను లీజుకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పులు తీర్చుకునేలా ప్రపోజల్స్?రెడీ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం టీజీఐఐసీ దగ్గరున్న భూముల్లో గతంలో ఎకరా రూ. 60 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు పలికిన ల్యాండ్స్?ఉన్నాయి. ఆ రేటుకు అనుగుణంగా దాదాపు 200 నుంచి 300 ఎకరాలు వివిధ బ్యాంకుల్లో తనఖా పెట్టడం ద్వారా సుమారు రూ. 20 వేల కోట్లు సమకూర్చుకోవాలని రేవంత్ సర్కారు భావిస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 16 జూన్ 2024

# గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి..

### సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య డిమాండ్..



ప్రజావినికిడి, (చెన్నూర్):జూన్ 15:

చెన్నూరు మండలం రాజన్న కాలనీలో గుడిసె వాసుల జనరల్ బాడీ సమావేశంలో నాగజ్యోతి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య గారు హాజరై మాట్లాడుతూ పేదలు 14 నెలలుగా ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని పోరాటం చేస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అక్కడే నివసిస్తూ,నిత్యం గుడిసె కేంద్రం నుంచి పనులకు వెళ్తున్నారని,గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని,ఇప్పుడున్న ప్రభుత్వం గుడిసె వాసులకు పట్టాలు ఇచ్చి,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.బోడంకి చందు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిరుపేదలు గుడిసెల్లో వర్షానికి,ఎండకు,చలికితట్టుకొని గుడిసె వేసుకొని అక్కడే నివసిస్తూ,అనేక ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాలు బోర్లు,కరెంటు,రోడ్డు నిర్మించి ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమ%శీ%లో గుడిసెల పోరాట కమిటీ సభ్యులు ఉమారాణి, సమ్మక్క,సరిత,చంద్రన్న,కుమార్,రాజేశ్వరి,రేణుక,సహన బేగం,బుధఅక్క, రమాదేవి, జమున,శ్రావణ్,యామిని,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డికి జన్మదిన

## శుభాకాంక్షలు తెలిపిన ఏడెల్లి



**ప్రజావినికిడి,(అంబర్ పేట్) :**

కేంద్ర బొగ్గు గనుల - మైనింగ్ శాఖ మంత్రివర్యులు కిషన్ రెడ్డిని ఢిల్లీలోని అధికారిక నివాసంలో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బిజెపి జాయింట్ కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# టీఎన్జీవో కేంద్ర సంఘం

# కార్యదర్శిగా ఎంఎస్ హుస్సేని



ప్రజావినికిడి, (నాంపల్లి) : టీఎన్జీవో కేంద్ర సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం హుస్సేని (ముజీబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీఎన్జీవో భవన్ లో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శి సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పర్వతాలు, కార్యదర్శులుగా రాగి శ్రీనివాస్, జానేశ్వర్ సింగ్,గూడ ప్రభాకర్, షఫీ అహమ్మద్, కార్యవర్గ సభ్యురాలిగా గీతా రాణి ఎన్నికయ్యారు.రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి అను సంధానంగా ఉంటూ ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి రామినేని శ్రీనివాస్ రావు, టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకులు,సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలున్నా పోడు భీడు పోతుంది..

### ఫారెస్ట్ అధికారుల తీరుపై ఆదివాసీ నేత ఎర్మ పున్నం ఆగ్రహం

### పట్టాలున్న పోడు భూములకు సర్వ హక్కులు కల్పించాలని వినతి..

### ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపు..



ప్రజావినికిడి, (చెన్నూర్):జూన్15,

పోడు భూములకు పట్టాలు ఉన్నప్పటికీ అటవీ అధికారులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ వారి భూములను దున్నుకోనివ్వకుండా ఆదివాసీలపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆదివాసీ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం కోటపల్లి మండలం సూపాక గ్రామంలో ఏర్పాటు చేసిన ఆదివాసీల సమావేశంలో పేర్కొన్నారు. ఆదివాసీలపై కక్షగట్టి భూములను దున్నడానికి వెళ్తున్న ఆదివాసీల పనిముట్లను వారి వాహనాలను సైతం తీసుకెళుతుండగా, పట్టాలు ఉన్నప్పటికీ పోడు భూములు బీడు భారుస్తూ కోటపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికుమార్ ఆదివాసీలకు ఆవేదన మిగులుస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. పోడు రైతులపై ఫారెస్ట్ రేంజ్ అధికారి రవికుమార్ మరియు అటవీ అధికారుల తీరును నిరసిస్తూ ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని,ఆదివాసీల హక్కుల సాధనకై ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పున్నం కోరారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తలాంటి ముత్తయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు తలండి రాజేష్, కార్యదర్శి ఎలండి మల్లేష్, స్వయం సడవలి, కొడితే పుష్పలత, తలాండి మహేశ్వరి, మడే మారయ్య, అలాంటి బాపు, తలండి సత్తయ్య మరియు పోరసాగుదారులు పాల్గొన్నారు.

# ఆరేండ్ల చిన్నారిపై జరిగిన సంఘటనకు నిరసనగా

# సుందరశాలలో కొవ్వొత్తుల ర్యాలీ..

### నిందితుడిని కఠినంగా శిక్షించాలి..

### -చెన్నూరు యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాడి రాజేందర్..

**ప్రజావినికిడి, (చెన్నూర్):జూన్15,**



చిన్నారి సహస్ర ఆరేండ్ల పాప పై అత్యాచారానికి పాల్పడ్డ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి.చెన్నూర్ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాజేందర్ మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో అర్ధరాత్రి ఆరేండ్ల పసిబిడ్డ పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన సంఘటన నాకు తీవ్రంగా బాధ కలిగించింది.ఈ దాడిని ఖండిస్తూ చెన్నూరు మండలం సుందరశాలలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది.పసిపాప కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులకు విన్నవించడం జరిగింది.ఈ సమాజంలో ఇలాంటి దారుణమైన సంఘటనలు మానవత్వానికి సిగ్గుచేటు.పసిబిడ్డల ప్రాణం తీసే ఉన్మాద ఆలోచనలకు మన సమాజంలో చోటు లేదు.ఇంత దారుణానికి పాల్పడిన మానవ మృగాన్ని, కామాంధుడు ఉత్తరప్రదేశ్ కు చెందిన బలరాం ను పోలీసులు అరెస్టు చేసి దారుణంగా శిక్షించాలి.బహిరంగంగా ఉరితీయాలి,అని పోలీస్ వారిని కోరడం జరిగింది.ఇలాంటి ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మేడ రాజు,రజనీకాంత్,రాజకుమార్ సంపత్,రాజు, శంకర్,కిరణ్, కుమార్,సతీష్, వినయ్,సురేష్, రజినీకాంత్,రోహిత్, శశికాంత్,శ్రీకాంత్, మల్లేష్, విజయ్, రాజేష్,అంజి,దుర్గం శంకర్,మరియు సుందరశాల గ్రామ యూత్ పెద్ద ఎత్తున పాల్గొని చిన్నారి సహస్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

# ప్రజలకు మరింత

# సేవ చేసే శక్తిని ఇవ్వాలి..

## షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే శంకర్,బాబర్ ఖాన్ శుభాకాంక్షలు..**



ప్రజావినికిడి,(హైదరాబాద్):

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్", పిసిసి సభ్యులు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలని భగవంతుడు మీకు ఆయురారోగ్యాలను, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తనకంటూ ఓ ప్రత్యేక హోదాను సృష్టించుకుని ప్రజలకు ఎన్నో సేవలు చేసుకుంటున్నా భట్టి విక్రమార్క లాంటి మంచి మనిషి మరొకరు ఉండరని వారు కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలుసిద్ధించాలని భగవంతుని కోరుకుంటూ విషెస్ తెలిపినట్టు పేర్కొన్నారు.

# అక్రమ పాఠశాలలపై

## కొరడా ఝులిపిస్తున్న విద్యాశాఖ అధికారులు...

**వనస్థలిపురంలో విద్యాశాఖ అనుమతి లేకుండా నడుస్తున్న: లిటిల్ చెర్రీస్ స్కూల్ సీజ్ చేసిన మండల విద్యాశాఖ అధికారి.**

**ప్రజావినికిడి,(హైదరాబాద్):**

హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకు అనేక అక్రమ పాఠశాలల పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండానే పెద్ద పెద్ద భవనాలలో, రంగురంగుల బ్రోచర్లు తో ప్రభుత్వ గుర్తింపు ఉన్నట్టు చూపిస్తూ, తల్లిదండ్రులను మోసం చేస్తూ, అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఇదే కోవాకు చెందిన రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ మండలం వనస్థలిపురం ఎఫ్ సి ఐ కాలనీలో లిటిల్ చెర్రీస్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ అనుమతి లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటూ, తల్లిదండ్రుల నుండి లక్షల్లో ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారని తెలుసుకున్న తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ షబ్బీర్ అలీ విద్యాశాఖ అధికారులకు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగింది. టిపిటిఎఫ్ ఫిర్యాదును అందుకున్న విద్యాశాఖ అధికారులు లిటిల్ చెర్రీస్ పాఠశాలను వెంటనే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉన్నత అధికారుల ఆదేశాలు అందుకున్న మండల విద్యాశాఖ అధికారి లిటిల్ చెర్రీ స్కూల్ ను శుక్రవారం సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించవద్దని, విద్యార్థులను పాఠశాలలో చేర్పించేటప్పుడు ఆ పాఠశాలకు గుర్తింపు ఉందా..? లేదా..? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులలో ఆయా పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.







## లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే కాదు...
# ఏపీలో వైసీపీదీ అదే పరిస్థితి

### రెండు కూటముల మధ్య పోటీగానే దేశ ప్రజలు చూశారన్న సుమన్



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు రెండు కూటముల మధ్య పోటీగానే చూశారని... అందుకే బీఆర్ఎస్‌కు సీట్లు రాలేదని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ఇటు ఎన్డీయే, అటు ఇండియా కూటములలో లేని పార్టీలను దేశవ్యాప్తంగా ప్రజలు ఆదరించలేదని పేర్కొన్నారు. ఏ కూటమిలో లేని మూడు నాలుగు పార్టీలు లోక్ సభ ఎన్నికల్లో వెనుకబడినట్లు చెప్పారు. ఏపీలో వైసీపీ, ఒడిశాలో బీజేడీ, ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ ఏ కూటములలో లేవని... ఆ పార్టీలకు కూడా నిరాశాజనక ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణలోనూ అదే ఫలితం వచ్చినట్లుగా భావిస్తున్నామన్నారు. అయినప్పటికీ ఉద్యమ పార్టీగా, తెలంగాణ తెచ్చిన పార్టీగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.తెలంగాణలో పేరుకే ప్రజాపాలన అంటున్నారని... కానీ పగలతో, ప్రతీకారంతో కూడిన పాలనను సాగిస్తున్నారని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎంతసేపూ కేసీఆర్‌పై విషం, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విద్వేషాన్ని రగిల్చే కుట్ర తప్ప మరొకటి లేదన్నారు. ప్రజలు అవకాశమిచ్చినందుకు ఏం చేద్దామనే ఆలోచన వారికి ఏమాత్రం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఇందుకు పాఠ్యపుస్తకాలను వెనక్కి తెప్పించడమే నిదర్శనమన్నారు.
పాఠ్యపుస్తకాలపై నాటి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిల పేర్లు ఉన్నందుకు వాటిని వెనక్కి తీసుకుంటున్నారని మండిపడ్డారు. తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం వచ్చాక స్కూల్ పుస్తకాలపై జయలలిత ఫొటో ఉంటే ఆ ప్రభుత్వం వెనక్కి తీసుకోలేదని గుర్తు చేశారు. ఒకవేళ కేసీఆర్ ఫొటో ఉండటం ఇబ్బందికరమైతే వేసవికాలంలోనే సమీక్ష నిర్వహించవలసి ఉండాల్సిందన్నారు. కానీ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక విద్యార్థుల్ని, పిల్లల్ని ఆందోళనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.
సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో పట్టపగలు హత్య జరిగిందని... ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడ ఉన్నాయన్నారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్‌లో పసిపాపను తీసుకెళ్లి అత్యాచారం చేశారని, హైదరాబాద్‌లో గంజాయి మూకలు స్వైరవిహారం చేస్తున్నాయని మండిపడ్డారు. హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోతున్నారన్నారు. గంజాయి మూకల స్వైరవిహారం, హత్యలు, దౌర్జన్యాలు, బెదిరింపులతో రేవంత్ రెడ్డి ఈ విశ్వనగరాన్ని కాస్త విషాద నగరంగా చేశారని విమర్శించారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ని
# దర్శించుకున్నఈటల



ప్రజావినికిడి,(ఎల్బీనగర్)
శనివారం రోజు కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీ వున్నటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి బిజెపి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొనడం జరిగింది.వారితోపాటు బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీ సామ రంగారెడ్డి అలాగే స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొనడం జరిగింది. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి,కళ్లెం నవజీవన్ రెడ్డి ఆలయ చైర్మన్ వంశి,కాలనీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.


## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో
# అనర్హులకు పోడు భూముల కేటాయింపు

### మంత్రి కొండా సురేఖ



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనర్హులకు పోడు భూముల కేటాయింపు జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పోడు భూముల పంపిణీపై సమగ్ర నివేదికను సమర్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలగకుండా అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ పోడు భూముల రక్షణకు కృషి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో పోడు భూముల్లో సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాలు సున్నితమైన పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని, క్రమశిక్షణా చర్యలకు గురికావద్దని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై శనివారం సమీక్షా సమావేశం జరిగింది.
ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, డిప్యూటీ సెక్రటరీ శ్రీలక్ష్మి, పిసిసిఎఫ్ డోబ్రియాల్, సిసిఎఫ్‌లు భీమా నాయక్, ప్రభాకర్, డిఎఫ్ఓలు రాహుల్ కిషన్ యాదవ్, కిష్టాగౌడ్, సిద్దార్థ్ విక్రంసింగ్, విశాల్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సమీక్షలో మంత్రి సురేఖ మాట్లాడుతూ పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతుల హక్కులను కాపాడడంలోనూ, అటవీశాఖ భూములను కాపాడే విధులను నిర్వర్తిస్తున్న అటవీ అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి కొన్నేళ్ళుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆధీనంలోకి తీసుకున్నట్లైతే కఠినచర్యలు చేపట్టాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్‌లపై శుక్రవారం గిరిజనులు చేసిన దాడిని మంత్రి సురేఖ ప్రస్తావించారు.
రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, రాష్ట్ర అటవీ సంపద, సహజ వనరుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం వెదకాలని మంత్రి సీతక్క నాతో పలుమార్లు ప్రస్తావించారని తెలిపారు. పోడు భూముల విషయంలో అటవీశాఖకు, రైతులకు మధ్య జరుగుతున్న సంఘర్షణలను నివారించేలా చర్యలు చేపట్టాలని, మార్గదర్శకాలు రూపొందించాలని కోరుతూ వచ్చారని వివరించారు. వీరి మధ్య జరిగే సంఘర్షణలతో ప్రభుత్వానికి మచ్చ రావద్దనే ఆలోచనతో ఈ సమస్యలకు పరిష్కారం వెదికేందుకు ప్రాథమికంగా నేడు సమావేశమైనట్లు స్పష్టం చేశారు. ఏళ్ళుగా కొనసాగుతున్న పోడు భూముల చిక్కు సమస్యను పరిష్కారం కనుగొనేందుకు ఈ సమావేశాన్ని ప్రాథమిక సమావేశంగా భావిస్తున్నామని మంత్రి సురేఖ తెలిపారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు..



ప్రజావినికిడి,(ఉప్పల్):ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న నితెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సంఘం తరపున సన్మానించడం జరిగింది.ప్రముఖ కవి పెద్దలుడాక్టర్ అందెశ్రీ నిసన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణరాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీటీసీ జంపాల రమేష్‌రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నం దాస్ చంద్రశేఖర్‌తదితర నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు
## హాజరైన ఈటెల రాజేందర్..
### ఆయనతోపాటు బిజెపి నాయకులు..



ప్రజావినికిడి,(నాగోల్):శనివారంరోజు నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అలాగే రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ఈ సందర్భంగా స్థానిక నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు ఎల్లపుడూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ స్వామివారిని కోరుకొన్నాను.అని కార్పొరేటర్ అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,బీజేపీ నాయకులు,మహిళ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఎన్.డి.పీ.అలాగే జీ.హెచ్.ఏం.సీ అధికారులతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పలు సమస్యలపై సమావేశం..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**



శనివారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జీ.హెచ్.ఏం.సీ.ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్ చే నిర్వహించిన సమావేశంలో ఎస్.ఎన్.డి.పీ.అలాగే జీ.హెచ్.ఏం.సీ.అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ,గతంలో మీరు నిర్మించిన ఎస్.ఎన్.డి.పీ.పనులు ఎంతో సత్ఫలితాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు.దానికి మీకు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.బాక్స్ డ్రైన్స్,ట్రంక్ లైన్స్ నిర్మాణల వల్ల చాలా వరకు ముంపు సమస్యలు పరిష్కారం కావడం జరిగింది అని తెలిపారు.దాదాపు 70%పనులు పూర్తి కావడం జరిగింది అని తెలిపారు.ఇంకా కొన్ని డివిజన్ల నందు పూర్తి స్థాయిలో డ్రైన్స్ నిర్మాణం చేపడితే మాకు ఎంతో మేలు చేసిన వారు అవుతారు అని తెలిపారు.గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని న్యూ గడ్డిఅన్నారం కాలనీ నందు వరదనీటి సమస్య పరిష్కారం చేయాలని,పక్క నియోజకవర్గం ఐ.ఎస్.సదన్.నుంచి వచ్చే నూతన డ్రైన్ నిర్మాణం వల్ల ఇట్టి ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతుంది అని తెలిపారు.కావున నూతన డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు.అలాగే హస్తినపురం డివిజన్ పరిధిలోని వందనపూరి కాలనీ నుంచి కె.కె.గార్డెన్స్ వరకు ట్రంక్ లైన్ పనులు త్వరగా చేపట్టాలని, పిండిపుల్లారెడ్డి కమన్ నుంచి ద్వారక తిరుమల కాలనీ వరకు మరియు వెంకటరమణ కాలనీ నుంచి సాగర్ రింగ్ రోడ్డు జంక్షన్ వరకు ట్రంక్ లైన్ నిర్మాణం చేపట్టాలని, మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా,హిమపురి కాలనీ మీదుగా మాన్సూరాబాద్ వీకర్ సెక్షన్ కాలనీ గుండా ప్రెస్ కాలనీ నుంచి డబల్ బెడ్ రూమ్ వద్ద ఉన్న ట్రంక్ లైన్ ఔట్ లేట్ నందు కలపాలని కోరడం జరిగింది.అలాగే చంపాపేట డివిజన్ పరిధిలోని సింగిరెడ్డి శివారెడ్డి గార్డెన్స్ వెనుక నుంచి ఉదయ్ నగర్ కాలనీ మీదుగా బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టడం జరిగింది అని ఇంకా కొంతమేర పనులు మిగిలివున్నాయని అవికూడా సకాలంలో పూర్తి చేస్తే అట్టి చుట్టుపక్కల కాలనీ వాసులకు ఎంతో మేలు చేసినవాళ్ళం అవుతాము అని తెలిపారు.అనంతరం చీఫ్ ఇంజనీర్ గారు అందుబాటులో ఉన్న అధికారులతో మాట్లాడుతూ,సుధీర్ రెడ్డి ప్రతిపాదనలు చేసిన అన్ని విషయాల మీద సమీక్ష సమావేశం నిర్వహించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అధికారులు అశోక్ రెడ్డి,కృష్ణయ్య,శ్రీనివాస్,కార్తీక్ మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి,భవాని ప్రవీణ్ కుమార్,జిట్టా రాజశేఖర్ రెడ్డి,నాయకులు సత్యంచారి,శ్రీనివాస్ నాయక్,రవిముదిరాజ్,పలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెస్కో మార్ట్ ఘనంగా ప్రారంభోత్సవం..






ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
శనివారం రోజు నాగోల్ డివిజన్ లోని నూతన ఫ్రెస్కో మార్ట్ ప్రారంభోత్సవం...
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అనంతరం వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది వీరితో పాటు సిద్దలా ఐలయ్య,పద్మ రెడ్డి,కవిత,రాధిక,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక





# బాబు పాలన @ సచివాలయం..

**టైమింగ్స్ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు!**
**సెక్రటేరియెట్ వేదికగా పాలన కొనసాగించనున్న చంద్రబాబు**
**నిరంతరం అందుబాటులో ఉండేందుకు నిర్ణయం**
**మంత్రులు ప్రతి రోజూ సచివాలయానికి రావాలని దిశానిర్దేశం**

**జూన్ 15(ప్రజావినికిడి:** ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ పగ్గాలు చేపట్టిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తన మార్క్ పాలన అందించేందుకు అడుగులు వేస్తున్నారు. గత ప్రభుత్వంపై వ్యక్తమైన తీవ్ర విమర్శలను దృష్టిలో ఉంచుకున్న ఆయన... గతంలో మాదిరిగానే ఈసారి కూడా సచివాలయం కేంద్రంగా తన పాలన కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు




సెక్రటేరియెట్‌లోనే అందుబాటులో ఉంటానంటూ తనను కలిసిన పలువురు ప్రజా ప్రతినిధులకు చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. గతంలో వ్యవహరించిన విధంగానే ఈసారి కూడా సచివాలయంలోనే నిరంతరం అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించబోతున్నట్టు ఆయన చెప్పారని తెలుస్తోంది. మంత్రులకు దిశానిర్దేశనం సెక్రటేరియెట్ నుంచి పాలన అందించాలని నిర్ణయించన సీఎం చంద్రబాబు కేబినెట్ మంత్రులకు కూడా కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు ప్రతి రోజూ సచివాలయానికి రావాలని, అదేవిధంగా సమయపాలన కచ్చితంగా పాటించాలని సీఎం సూచించినట్టు తెలుస్తోంది. తమ శాఖలపై పట్టు పెంచుకోవాలని, పరిపాలన పరంగా సంపూర్ణ అవగాహన పొందాలని సూచించారు. సచివాలయంలో తనను కలిసేందుకు వచ్చిన మంత్రులకు ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారని సమాచారం.

# నా మనసుకు దగ్గరైన శాఖలు

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, పర్యావరణం టెక్నాలజీ శాఖలు**
**సంతోషం వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఏపీ డిప్యూటీ సీఎంగా నియమితుడైన జనసేనాని పవన్ కల్యాణ్ తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయనకు డిప్యూటీ సీఎం పదవితో పాటు పలు ఇతర శాఖలు కూడా కేటాయించడం తెలిసిందే. దీనిపై పవన్ కల్యాణ్ స్పందించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తాను నిర్వర్తించబోయే శాఖలు తన మనసుకు, జనసేన మూల సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక.. ఈ శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా తాను భావిస్తున్నట్టు తెలిపారు.

2008 నుంచి ప్రత్యక్ష రాజకీయాలలో ఉన్న నేను ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటించాను. 2019 ఎన్నికలకు ముందు ప్రజా పోరాట యాత్రను ప్రజల సమస్యల అవగాహన, మౌలిక సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసమే చేపట్టాను. చాలా లోతుగా ఆనాడు స్వయంగా పరిశీలన జరిపాను. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై బలమైన అవగాహన ఏర్పడింది.

విశాఖ మన్యంలో పర్యటిస్తున్నపుడు కురిడి అనే గిరిజన గ్రామానికి వెళ్ళాను. ఆ గ్రామ ఆడపడుచులు గుక్కెడు నీళ్ళ కోసం తాము పడుతున్న అవస్థలు చెబుతూ, అక్కడి బావిలో కలుషితమైపోయిన నీటిని చూపించారు. ఆ ప్రాంతంలోనే తోటవలస గ్రామానికి వెళ్లినప్పుడు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ఊరివాళ్ళు వివరించారు. గోదావరి జిల్లాలకు వెళ్లినప్పుడు పలు మత్యకార గ్రామాలవాసులు తాగు నీటి కోసం ఎన్ని ప్రయాసలుపడుతున్నామో చెప్పారు. గ్రామీణ అభివృద్ధి - దేశాభివృద్ధి అనే నినాదం నామమాత్రంగా మిగిలిపోవడాన్ని గమనించాను. గుక్కెడు మంచి నీరు కోసం మైళ్ళ దూరం వెళ్లి ప్రయాసతో బిందెడు నీరు తెచ్చుకుంటున్న ఆడపడుచుల అవస్థలు చూసాను. కాలుష్యమయమైన జల వనరులనే తాగు నీరుగా తప్పని పరిస్థితులలో వాడుకుంటున్న పల్లెవాసులను గమనించాను. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జల్ జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగు నీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తాను.

'పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది జనసేన మూల సిద్ధాంతాల్లో ఒకటి అని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఒక పక్క పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరగాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందాలి అని నేను గట్టిగా కోరుకుంటున్నాను. అయితే ఆ అభివృద్ధి పర్యావరణానికి హితంగా జరగాలి. ఆధునిక సాంకేతికత మేళవించిన సురక్షితమైన పారిశ్రామిక అభివృద్ధి ఈ సమాజానికి అవసరం.

విశాఖ ఎల్.జి. పాలిమర్స్ ప్రమాదాన్ని మనం ఏనాడూ మరచిపోలేము. ప్రజల ఆరోగ్యాలను హరించి వేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా పరిశ్రమలు ముందుకు వెళ్ళడానికి చేయూతనిస్తాము. భూ తాపాన్ని తగ్గించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా నిలుస్తాము. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం.వృక్షో రక్షతి రక్షితః అనే సూక్తి నా మదిలో ఎప్పుడూ మారుమోగుతుంటుంది. ఒక్క వృక్షాన్ని రక్షించుకుంటేనే మానవ కోటికి ఎంతో మేలు కలుగుతున్నప్పుడు.. మరి లక్షలాది వృక్షాలను తన గర్భాన నిలుపుకున్న అడవి తల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటే ఎంతో మేలు కలుగుతుంది. అడవుల విధ్వంసమే కరవు కాటకాలకు హేతువు. అటువంటి అడవులను కంటికి రెప్పలా కాపాడతాం.

ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతాం. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్ళవలసిందే. సామాజిక వనాలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

తీర ప్రాంతాల్లో మడ అడవుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. శాస్త్ర, సాంకేతిక విభాగాలు మానవాళి శ్రేయస్సుకు, లోక కళ్యాణానికి అత్యంత అవశ్యం.అదే విధంగా జనసేన పార్టీ నుంచి మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించబోయే నాదెండ్ల మనోహర్ గారు, కందుల దుర్గేష్ లకు ప్రజా ప్రయోజనం కలిగిన, అభివృద్ధి సంబంధిత శాఖలు అప్పగించారు. పౌరసరఫరాలు, టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖలు కేటాయించడం సంతోషంగా ఉంది. నాదెండ్ల మనోహర్ గారు నిర్వర్తించే ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం. ప్రజా పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేస్తాం. రేషన్ కార్డుదారులకు నిత్యావసరాల పంపిణీపై ప్రత్యేక దృష్టిపెడతాం. అదే విధంగా రైతుల నుంచి పంటల కొనుగోలు విధానం, వారికి సొమ్ములు చెల్లించడంలో మెరుగైన విధానాలు అవలంబిస్తాం. రాష్ట్రంలో వరి రైతులకు పంట కొనుగోలు డబ్బులు అందించడంలో గత ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య పోకడలు, రైతుల వేదనలు స్వయంగా చూశాను. ఆ పరిస్థితులు రానీయం.

రాష్ట్రంలో పర్యాటకం అభివృద్ధి జరిగితే ఉపాధి అవకాశాలు చాలా పెరుగుతాయి. ఆహ్లాదకర పర్యాటకంతోపాటు, ధార్మిక, భక్తి పర్యాటకం అభివృద్ధిపై దృష్టి పెడతాం. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. పర్యాటక కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించడంతోపాటు రాష్ట్రానికి ఒక బ్రాండ్ కల్పించడంపై దృష్టిపెట్టాలి. అదే విధంగా సినిమా రంగానికి రాష్ట్రంలో ప్రోత్సాహకర, స్నేహపూరిత వాతావరణం తీసుకువస్తాము. చిత్రీకరణ ప్రాంతాలలో సినీ పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ఈ రంగంలో రాష్ట్ర యువతకు ఉపాధి దక్కేలా చూస్తాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు కావడానికి ఎనలేని సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి, ప్రజలతో నేరుగా సంబంధ బాంధవ్యాలు కలిగిన మంత్రిత్వ శాఖలు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

జనసేన పార్టీకి కేటాయించిన శాఖల ద్వారా చిత్తశుద్ధితో ప్రజా సేవలు అందిస్తాం. నేను నిర్వర్తించబోయే శాఖలపై మరింత లోతైన అధ్యయనం జరిపి ప్రజలకు అత్యంత మేలైన ఫలాలను అందించడానికి శక్తి వంచన లేని కృషి చేస్తానని 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ వాసులకు సవినయంగా తెలియచేస్తున్నాను.

# ఐఏఎస్ అధికారిణిగా పోలీస్ అకాడమీకి కుమార్తె..

**సెల్యూట్ చేసి స్వాగతించిన ఐపీఎస్ తండ్రి..!**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఐఏఎస్ అధికారిణిగా పోలీస్ అకాడమీకి వచ్చిన కుమార్తెకు ఆ పోలీస్ అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఐపీఎస్ తండ్రి సెల్యూట్ చేశాడు. హైదరాబాద్ చిల్కూరు ఏరియాలోగల 'రాజ్‌బహదూర్ వేంకట రంగారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ లో శనివారం మధ్యాహ్నం ఈ అత్యంత అరుదైన ఘటన జరిగింది.శనివారం ఏడుగురు ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు ప్రాక్టికల్ ట్రెయినింగ్ కోసం **RBVRR TGPA** కు వచ్చారు. వారికి పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్‌కు బదులుగా.. జాయింట్ డైరెక్టర్ డీ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ వేంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం అకాడమీ మరో డిప్యూటీ డైరెక్టర్ సీ నర్మద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులకు బ్రీఫ్ ప్రజంటేషన్ ఇచ్చారు.ఆ తర్వాత ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌లో ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు తమ ట్రెయినింగ్ అనుభవాలను పంచుకున్నారు. ఆ తర్వాత ట్రెయినీ ఐఏఎస్‌లు పోలీస్ అకాడమీ క్యాంపస్ అంతటా కలియ తిరిగారు. ఈ సందర్భంగా అకాడమీలోని అధికారులు.. పోలీస్ ట్రెయినింగ్‌కు సంబంధించిన పలు అంశాలను క్షుణ్ణంగా వివరించారు.అయితే పోలీస్ అకాడమీకి ప్రాక్టికల్ ట్రెయినింగ్ కోసం వచ్చిన ఏడుగురు 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారుల్లో ఉమా భారతి ఒకరు. ఆ ఏడుగురు ఐఏఎస్ అధికారులకు సెల్యూట్ చేసి స్వాగతం పలికిన వారిలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ వేంకటేశ్వర్లు ఉన్నారు. ఆయన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి ఉమా భారతికి కన్నతండ్రి. ఐఏఎస్ అధికారిణిగా వచ్చిన బిడ్డకు ఐపీఎస్ తండ్రి సెల్యూట్ చేసిన ఈ ఘటన అకాడమీలో ఓ ప్రత్యేకతగా నిలిచింది. ప్రస్తుతం ఉమాభారతి వికారాబాద్ జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

# రూ. కోటీ 83 లక్షల మద్యం బాటిళ్ల ధ్వంసం

**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్న మద్యం బాటిళ్లను అధికారులు ధ్వంసం చేశారు. గోవా, హర్యానా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, వెస్ట్ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి ట్యాక్స్ చెల్లించని 686 కేసుల మద్యాన్ని( ఫుల్ బాటిల్స్) అధికారులు హైదరాబాద్ లో పట్టుకున్నారు. అనంతరం వాటిని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ సమక్షంలో వివిధ స్టేషన్లలో పట్టుకున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 10 వేల 222 లీటర్ల మద్యాన్ని శనివారం అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు. అన్నింటిని రోడ్ రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు. ధ్వంసం చేసిన మద్యం విలువ రూ.1.83 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ పరిధిలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్‌గా పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం డిప్యూటి కమిషనర్ ధశరధ్, ఇతర అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు.వివరాల్లోకి వెళితే రంగారెడ్డి డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ పోలీస్ పరిధిలో గోవా,హర్యానా, ఢిల్లీతో సహ ఇతర రాష్ట్రాల నుంచి ఎక్సైజ్ పన్నులు చెల్లించకుండా తెలంగాణకు బస్సుల్లో, విమానాల్లో, వాహనాల్లో తీసుకవచ్చిన సమయంలో పట్టుబడిన మద్యం ఫుల్ బాటిళ్లను చాల కాలంగా పోలీస్ స్టేషన్లలో నిల్వ చేశారు. ఈ మద్యం బాటిళ్లను ఉన్నతాధికారులు



అనుమతితో రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ దాశరథ్ ఇతర ఎక్సైజ్ అధికారుల సమక్షంలో శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్ పరిధిలో ఈ మద్యాన్ని ధ్వంసం చేశారు. వివిధ పోలీస్ స్టేషన్లలో 686 కేసుల్లో పట్టుబడిన మద్యం ఫుల్ బాటిళ్లలో ఉన్న మద్యం 10,222 లీటర్ల అంచనా మద్యాన్ని ధ్వంసం చేశారు. పట్టుబడిన మద్యం సీసాలను ఒక ఖాళీ స్థలంలో పోసి వాటిపై రోలర్ను తిప్పడంతో మద్యం బాటిళ్లు పలికి మద్యం నేలపాలు అయ్యింది. ఈ మద్యం విలువ రూ. 1,83,42,763 విలువ ఉంటుందని డిప్యూటి కమిషనర్ దశరథ్ తెలిపారు. వివిధా రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాల్లోంచి మద్యం తక్కువ ధరలకు లభిస్తుందని భావించిన కొందరు తక్కువ ధరలకు మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు తెలంగాణలో అమ్మకాలు జరపాలని కొందరు తీసుకు వస్తే మరి కొందరు తమ స్వంత అవసరాలకు వాడుకోవడానికి తీసుకుని వస్తారు.

కానీ ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రంలోకి మద్యం తీసుకురావడానికి అనుమతి ఉండాలి. మద్యాన్ని తీసుకు రావడానికి అవసరమైన పర్మిట్లు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ విషయంలో పర్యాటకులు కానీ, ఇతర వ్యక్తులు కానీఆ తక్కువ ధరలకు లభిస్తుందని మద్యాన్ని తీసుకు రావద్దని డిప్యూటి కమిషనర్ సూచించారు. ఇలా మద్యాన్ని తీసుకు వస్తే ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు. ఫంక్షన్లలో కూడా నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. డిప్యూటి కమిషనర్‌తో పాటు ఎక్సైజ్ సూపరింటెంట్ కృష్ణప్రియ, అసిస్టెంట్ సూపరింటెంట్ శ్రీనివాసరెడ్డి, శంషాబాద్ ఎస్ హెచ్ ఓ గంద్ర దేవేంద్ర రావుతోపాటు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు , కానిస్టేబుళ్లు ఈ మద్యం ధ్వంసం కార్యక్రమంలో పాల్గొన్నారు.




## రవితేజ 'మిస్టర్ బచ్చన్' నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్

టాలీవుడ్ మాస్ మహరాజా రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హెూగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన టైటిల్ పోస్టర్‌లో రవితేజ తన ఫేవరేట్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ పోజ్‌లో కనిపిస్తూ మూవీ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. తాజాగా మూవీ కంప్లీట్ అయినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా దర్శకుడు హరీశ్ శంకర్ ఒక ప్రమోషనల్ వీడియో విడుదల చేశాడు.

# స్టార్‌డమ్ కోసం సీన్లు రాస్తే వర్క్‌వుట్ కాదు: నాగ్ అశ్విన్

మోస్ట్ అవైటెడ్ 2024 మూవీ కల్కి 2898 విడుదలకు ఇంకా రెండు వారాలు మాత్రమే మిగిలి ఉంది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ చిత్రం భారీ హైప్ తో విడుదలకు సిద్ధమవుతోంది. నిస్సందేహంగా ఇటీవలి కాలంలో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఏకైక సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. జూన్ 27.. రిలీజ్ డే కావడంతో అన్నిరకాలుగా సస్పెన్స్ కి తెరపడనుంది. బాహుబలి స్టార్ నుంచి వస్తున్న మరో భారీ ప్రయోగాత్మక చిత్రంగా కల్కి చిత్రాన్ని ప్రపంచం చూస్తోంది. ఇందులో దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీ సహా అన్ని పరిశ్రమల తారలు కీలక పాత్రల్లో నటించడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న స్టార్లను డైరెక్ట్ చేయడం అనేది ఒక పెద్ద సవాల్ కదా? అని ప్రశ్నించగా... కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ఛాలెంజ్ గురించి ఓపెనయ్యారు. ప్రభాస్- దీపికా పదుకొనే వంటి పెద్ద స్టార్‌డమ్ ఉన్న తారల్ని ఎలా డీల్ చేశారు? అని ఫిలింకంపానియన్ ప్రశ్నించగా.. కొన్ని విషయాల్లో తాను నిర్లక్ష్యంగా ఉన్నానని, ఇది ఒక విధంగా మంచిదని దర్శకుడు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. అదో రకం మతిస్థిమితం లేనివాడిని అని అతడు వ్యాఖ్యానించినట్టు ఫిలింకంపానియన్ పేర్కొంది. నాగ్ అశ్విన్ మరింత వివరణాత్మకంగా మాట్లాడుతూ.. ప్రభాస్ - దీపికలకు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అభిమానుల నుంచి వారు పొందే ప్రేమ గురించి నాకు పూర్తిగా తెలుసునని అన్నాడు. ఫలానా సీన్ లో తమ ఫేవరెట్ తారల్ని చూసాక అభిమానులు ఎలా రెస్పాండ్ అవుతారో కూడా నాకు తెలుసునని అన్నాడు. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా తారల స్టార్‌డమ్‌ను ఎలివేట్ చేయడానికి సన్నివేశాలు సృష్టిస్తే సినిమా విఫలమవుతుందని ఆయన స్పష్టం చేశారు. భైరవ లాంటి క్యారెక్టర్ పేపర్‌పై చేసే పని ఆధారంగా అది తెరపైనా, ప్రేక్షకులతో కలిసి పని చేస్తుందని నాగ్ అశ్విన్ అన్నారు. ప్రేక్షకుల స్పందన గురించి ఆలోచించి ఆపై సన్నివేశాన్ని రాస్తే రివర్స్ ఇంజనీరింగ్ స్క్రీన్‌పై ఎల్లప్పుడూ ఫ్లాట్‌గా అనిపిస్తుందని వ్యాఖ్యానించాడు. కల్కి నాగ్ అశ్విన్ కెరీర్ లో నాలుగో చిత్రం. ప్రభాస్‌తో అతడి మొదటి చిత్రం. సైన్స్ అంశాలతో పాటు, పురాణ పౌరాణిక వైజ్ఞానిక కల్పన ఈ చిత్రంలో భాగం. ఇందులో బుజ్జి పాత్రకు కీర్తి సురేష్ వాయిస్ అందించారు. ప్రభాస్ పాత్ర భైరవ వాహనం బుజ్జి ఇందులో వెరీ స్పెషల్. ఈ చిత్ర కథాంశం 3102 మధ్య కాలానికి 6000 సంవత్సరాన్ని కలుపుతూ సాగుతుంది. భవిష్యత్ ప్రపంచం ఎలా ఉంటుందో తెరపై ఆవిష్కరించామని నాగ్ అశ్విన్ గతంలో వెల్లడించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సి. అశ్వని దత్ ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మించారు. సంతోష్ నారాయణన్ చిత్రానికి సంగీతం అందించారు. సెర్బియా సినిమాటోగ్రాఫర్ డ్జోర్జే స్టోజిల్జ్కోవిచ్ సినిమాటోగ్రఫీ అందించారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.





## కన్నడ బ్యూటీ కిర్రెక్కిస్తుందే!

కన్నడ బ్యూటీ రెబా మోనికా జాన్ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు తొలి సినిమాతోనే మంచి లాంచింగ్ దొరికింది. సామజవరగమన చిత్రంలో యంగ్ హీరో శ్రీ విష్ణుతో రొమాన్స్ చేసి ఆకట్టుకుంది. గతేడాది రిలీజ్ అయిన సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది. రెబా మోనికా అందం, అభినయం అన్నీ సినిమాకి ప్లస్ అయ్యాయి. నేచురల్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. దీంతో అమ్మడికి టాలీవుడ్ లో కొన్నాళ్ల పాటు తిరుంగడదనుకున్నారు. కానీ రెబా కెరీర్ మాత్రం తెలుగు పరిశ్రమలో అలా సాగలేదు. హిట్ ఉన్నా? అప్పటి నుంచి ఇప్పటివరకూ మరో తెలుగు సినిమాకి కమిట్ అవ్వలేదు. తమిళ్, కన్నడ భాషల్లోనే సినిమాలు చేసింది తప్ప! ఇక్కడ మరో ఛాన్స్ అన్నది కనుచూప మేర కూడా కనిపించలేదు. ఆ రకంగా అమ్మడు ఇక్కడ అన్ లక్కీ గాళే అనే చెప్పాలి. హిట్లు లేని హీరోయిన్లే కొత్త సినిమాలు చేస్తున్నారు. కానీ అన్ని ఉన్నా! ఛాన్సులు లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయమే. అలాగని అమ్మడు నిరుత్సాహ పడలేదు. తాను చేయాల్సిన ప్రయత్నాలు చేస్తూనే ఉంది. మరోవైపు ఇన్ స్టాలోనే అంతే యాక్టివ్ గా కొనసాగుతుంది. ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో కుర్ర కారులో జోష్ నింపు తుంది. చిట్టి పొట్టి దుస్తుల్లో కన్నడ సొయగం కిర్రెక్కించడంలో తక్కువేం కాదని చాటుతూనే ఉంది. తాజాగా అమ్మడు మరో హాట్ ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా బీచ్ రిసార్ట్ లో తడిపోడి అందాల్లో వైట్ షర్ట్ వెనుక వేడిని హైలైట్ చేసింది. ఎలాంటి మ్యాకప్ లేకుండా ఆ కళ్లతోనే మత్తెక్కించే ప్రయత్నం చేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. అయితే ఈ స్నాప్ ని ఉద్దేశించి ఓ కొంటె కవతని వదలింది. కేశాలంకరణ లేదు. క్రేజీ మేకప్ లేదు. ఫాన్సీ బట్టలు లేవు. ఇప్పటివరకూ నేనెప్పుడు ఇలా కెమెరా ముందు కనిపించలేదు. తొలిసారి మీ కోసం ఇలా అంటూ సంకేతాలు పాస్ చేసింది. ఇవేవి లేకపోయిన బ్యూటీ బీచ్ ముందు ఎంతో ఆస్వాదనకు గురైట్లు చెప్పుకొచ్చింది.

## వాళ్లు గుర్తు పట్టడంతో షాక్ అయ్యా..!

టాలీవుడ్ లో బోణీ సినిమాలో నటించడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు నటిగా పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి కర్బందా. ఈ అమ్మడు సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ కాల కెరీర్ లో ఈ అమ్మడు పలు సినిమాల్లో నటించగా అందులో కొన్ని నిరాశ పరచగా కొన్ని హిట్ గా నిలిచాయి. తాజాగా తన సినీ కెరీర్ 15 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇన్నాళ్ల తన సినీ కెరీర్ చాలా సంతృప్తిగా సాగిందని చెప్పుకొచ్చింది. నా జీవితంలో నేను నటిగానే ఎక్కువ కాలం గడిపాను అన్నట్లుగా పేర్కొంది. ఇంకా కృతి కర్బందా మాట్లాడుతూ.... కన్నడ లో నేను మొదట చేసిన గూగ్లీ సినిమాలో డాక్టర్ స్వాతిగా కనిపించాను. ఆ సినిమా విడుదల తర్వాత ఒక రోజు షాపింగ్ కు వెళ్లాను. అక్కడ కొంత మంది నన్ను గుర్తు పట్టి డాక్టర్... డాక్టర్ అంటూ పిలిచారు. వారు డాక్టర్ స్వాతి అంటూ నన్ను గుర్తు పట్టడంతో షాక్ అయ్యాను. అప్పుడే హీరోయిన్స్ కి, సినిమా వారికి ఎంతటి క్రేజ్ ఉంటుంది, ఇండస్ట్రీలో ఉంటే ఎలా జనాలు చూస్తారు అనేది అర్థం అయ్యింది. నా 15 ఏళ్ల సినీ కెరీర్ లో భాగస్వామ్యులు అయిన ప్రతి ఒక్కరికి కూడా పేరు పేరున కృతజ్ఞతలు. నాకు మంచి పాత్రలు ఇచ్చిన దర్శక నిర్మాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు అంది. టాలీవుడ్ లో ఈ అమ్మడు పవన్ కు జోడీగా తీన్మార్ సినిమాలో నటించడంతో పాటు మరి కొన్ని సినిమాల్లో కూడా నటించింది. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి ఆఫర్లు తెలుగు లో ఎక్కువ రాలేదు. అయినా కూడా కెరీర్ లో ఈ అమ్మడు ఆగకుండా ఇతర భాషల్లో సినిమాలు చేస్తూ వచ్చింది. మరో 15 ఏళ్ల పాటు ఈ అమ్మడి కెరీర్ కొనసాగించే అవకాశాలు ఉన్నాయంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



## ఆగస్టు 15న 'డబుల్ ఇస్మార్ట్'.. 'పుష్ప' వెనక్కి వెళ్లినట్లేనా?

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా రూపొందుతున్న 'డబుల్ ఇస్మార్ట్' మూవీ విడుదల తేదీని తాజాగా మేకర్స్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీన సినిమాను విడుదల చేస్తున్నట్లు ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి పార్ట్ సూపర్ హిట్ కావడంతో దర్శకుడు పూరీ జగన్నాథ్ సైతం ఈ మూవీపై మరింత దృష్టిసారించినట్లు సమాచారం. రామ్‌తో కావ్య థాపర్ జోడి కడుతున్న ఈ సినిమాలో సంజయ్ దత్, శాయాజీ షిండే, గెటప్ శ్రీను తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. అలాగే ఈ మూవీని చార్మీ కౌర్, పూరీ జగన్నాథ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఇక ఇప్పటికే ఆగస్టు 15న విడుదల కావాల్సిన 'పుష్ప 2' వాయిదా పడ్డట్లు తెలుస్తోంది. ఈ రూమర్స్ గురించి క్లారిటీ రానప్పటికీ తాజాగా ఈ రిలీజ్తో తప్పకుండా 'పుష్ప' వాయిదా పడ్డట్లే అని అర్ధమవుతోంది.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613